# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 25 ఏప్రిల్, 2026 | పేజీలు :08


## ఆర్టీసి కార్మికులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దు

### మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసి కార్మికులు చేపట్టిన ఆందోళనలపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. కార్మికులు ఎవరూ ఆందోళన చెందవద్దని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించేదుకు సిద్దంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి ఉద్యోగులు సంయమనం పాటించాలని, సమ్మెను విరమింపజేసే దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్చలు జరుపుతోందని వెల్లడించారు.కార్మికలు ఎవరు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసి కార్మికుల ఆందోళనలను ఉక్కుపాదంతో అణిచివేసిన చరిత్ర ఉందన్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. గతంలో 55 రోజుల పాటు సమ్మె జరిగినా నాటి ప్రభుత్వం స్పందించలేదని, ఆ సమయంలో 36 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం చలించలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కార్మికులను రెచ్చగొడుతున్నాయని వారి కుట్రలను కార్మికులు గమనించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పూచించారు.

# రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/రుద్రంగి/వేములవాడ:** రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డిజిపి బి. శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రెండు కోట్ల యాభై లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డిజిపి బి. శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గీతేతో కలిసి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ మావోయిజం అంతమైందని స్పష్టం చేశారు రాష్ట్ర పోలీసింగ్ లో నూతన మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రంగానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడం లేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుండి బయటకు వచ్చిన తరువాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

**నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజలకు భద్రత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు, మహాశివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో రాధాభాయ్, డిఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సిఐ వెంకటేశ్వర్లు, సిఐలు, ఎస్ఐలు, సర్పంచ్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రాయికల్ :** యువత చెడు అలవాటులకు దూరంగా ఉండి అలవర్చుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారంపట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జిఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు గత పది సంవత్సరాలుగా అసిస్టెంట్ ఎలక్ట్రిషన్,హోమ్ ఎయిడ్ హెల్త్, టైలరింగ్,టు వీలర్ బైక్ మెకానిక్ కోర్సుల్లో సుమారు 2100 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత ఉపాధి శిక్షణ అందించగా,1500 మందికి ప్రశంస పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న యువతులు ఇంటి దగ్గర వైద్య సేవలు అందించడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమని,ఉన్న భూములమ్మి చదివి ఉద్యోగం లేక ఊర్లల్లో తిరిగే పరిస్థితులు ఉన్నాయని,ఈరోజుల్లో యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని,దేశంలో అత్యధికంగా పంజాబ్ లో డ్రగ్స్ కి యువత అలవాటు పడ్డారని,పాకిస్తాన్ డ్రోన్ ల ద్వారా మన దేశానికి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తుందని,దేశ యువతను పక్కదారి పట్టించే కుట్ర జరుగుతుందని,అలాంటి అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవడానికి రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిఘా వ్యవస్థను (ఈగల్)ను ఏర్పాటు చేశారని,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి,వసుదైక కుటుంబాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.జగన్నాథ్ పూర్‌బోర్నపల్లి మధ్యన బ్రిడ్జి నిర్మాణ నిధుల కేటాయింపులో తన వంతుగా కృషి చేయాలని విద్యాసాగర్ రావు ను ఎమ్మెల్యే కోరారు. శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు గతంలోని నీటి కొరతను తీర్చేందుకు బోర్ ను ఏర్పాటు చేశామని,హాస్టల్ వసతికి తన వంతుగా 30 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు నిధుల నుండి ప్రహరీ కూడా నిర్మాణానికి 35 లక్షల నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉందని,ఇట్టి పనులను స్థానిక మున్సిపల్ చైర్మన్ త్వరితగతిన ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఇన్చార్జి ఏ.ఎం రాజురెడ్డి, ప్రతిమ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ గీతారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కౌశిక్, ఆర్గనైజర్లు రఘుపతి, విజయ, శ్రీకాంత్, శ్యామల, దొరసాని, జిఎంఆర్ సిబ్బంది ప్రమోద్, నాగేందర్, చిరంజీవి, కృష్ణవేణి, వనిత పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన

**ప్రజాపక్షం/భైంసా:** భైంసా పట్టణంలో ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భైంసా సబ్ డివిజన్ పరిదిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో ''షీ టీం'' పాత్ర**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.



# గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించండి ఆర్జీ3, జియం

**ప్రజాపక్షం/రామగిరి:** ఉద్యోగులు గైర్హాజరు శాతాన్ని తగ్గించుకొని, విధులు నిర్వహించాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. రామగుండం3 ఏరియా లోని గనులు,విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 2025 సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు 150 మస్టర్ల కంటే తక్కువ, ఈ సంవత్సరం జనవరి నుండి మార్చి 31 వరకు 50 పనిదినాలు (మస్టర్లు) కూడా చేయని ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు సిఎన్ సిఓఎ క్లబ్ నందు శుక్రవారం కౌన్సిలింగ్ ను నిర్వహించారు.గైర్హాజరు అవుతున్న 51 మంది ఉద్యోగులను గుర్తించి వారి కుటుంబ సభ్యులతో సహా కౌన్సిలింగ్ కు ఆహ్వానించారు.30 మంది కౌన్సిలింగ్ కు హాజరైనారు. వారికి కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.వీరి గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. మీ కుటుంబ సభ్యుల భవిషత్తు కోసం గైర్హాజరు కాకుండా విధులకు హాజరు కావాలని, ఒక కుటుంబం లాగా అందరం కలసి కట్టుగా విధులు నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర




రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియం బి.వి.సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె.రాజశేఖర్, సిహెచ్పీ డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన డిఆర్‌డిఒ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పకీరు కొండాపూర్, యామాపూర్, ఎర్రపూర్ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డిఆర్డిఓ రఘువరన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, తాసిల్దార్ వరప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ మాట్లాడుతూరైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని మద్దతు ధర పొందాలని అన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2389, కామన్ గ్రేడ్‌కు 2369, సన్న రకానికి 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.కొనుగోళ్లు సజావుగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు డిఆర్డిఓ సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలోని పాత ఐకెపి భవనంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని, అదేవిధంగా మండలంలోని అమ్మక పేట గ్రామానికి చెందిన మమత అనే మహిళా కు స్త్రీ నిధి రుణము ద్వారా మంజూరైన మూడు లక్షల యూనిట్ కు సంబంధించి మంజూరైన ఎలక్ట్రిక్ ఆటోను డి ఆర్ డి ఓ పి డి రఘువరన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, కనుక నాగేష్, తోట రమేష్, రచన హరీష్, ఐకేపీ ఏపీఎం అల్లేశంకర్,ఆయా గ్రామాలకు చెందిన ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, మహిళలు,ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరిట పచ్చని చెట్లను తొలగింపు



**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తుంటే,మరోవైపు పర్యావరణ ప్రేమికులను ఆవేదనకు గురిచేస్తున్నాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ నుండి ముత్తారం వరకు ఉన్న ప్రధాన రహదారిని వెడల్పు చేసే క్రమంలో రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను అధికారులు యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ఓడేడు గ్రామ మాజీ సర్పంచ్ సిరికోండ బక్కారావు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలోగత 7 సంవత్సరాల క్రితం అధికారులు, స్థానికులు ఎంతో కష్టపడి నాటి, సంరక్షించిన ఈ చెట్లు ఇప్పుడు రోడ్డు వెడల్పులో భాగంగా నేలమట్టం అవుతున్నాయి.వందల సంఖ్యలో ఉన్న ఈ చెట్లను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో, ప్రయాణికులకు నీడను ఇచ్చే ఈ పచ్చని చెట్లు కనుమరుగుకావడం వల్ల ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత కనీసం ఇప్పుడు కోల్పోయిన చెట్లకు రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఆర్‌టిసిని అప్పుల ఊబి నుండి రక్షించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం కొనసాగుతున్న పోరాటానికి తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లిజిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్యలు అన్నారు. శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విలీనం అనేది కేవలం జీతాల పెంపుకే పరిమితం కాకుండా, ఉద్యోగుల పూర్తి హక్కులు, భద్రత, గౌరవం కల్పించడమే లక్ష్యం కావాలని అన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్‌టిసి విలీన చట్టం 2023ను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు, ఆర్టీసీ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.వెంటనే కొత్త సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, ఉద్యోగులందరినీ పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ హోదా కల్పించాలని,గత పదేళ్లలో ఖాళీ అయిన సుమారు 20,000 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. పని ఒత్తిడి తగ్గించి, ఉద్యోగుల భద్రతను పెంచాలని,పెండింగ్‌లో ఉన్న 2021–2025 వేతన సవరణలను వెంటనే ప్రకటించాలని,సరైన ఫిట్మెంట్‌తో కొత్త వేతనాలు అమలు చేయాలని అన్నారు.ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని 50 లక్షల ఎక్స్ గ్రేషియోతో ఇవ్వడం తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, మేధావులు ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పులిపాక రవీందర్, కే. రాజన్న, కాంపల్లి అంజయ్య, భూపాల సుధాకర్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/జగిత్యాల :** పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కో ఆప్షన్ ఎన్నికను నిర్వహించారు.కో ఆప్షన్ పదవీ కోసం 12 మంది పోటీ పడగా వీరబత్తిని పద్మజ, గట్టు సతీష్, తస్లీం సుల్తాన,మహమ్మద్ అబ్దుల్ కదీర్ లు కోఆప్షన్ సభ్యులు గా ఎన్నికయ్యారు. అనంతరం పురపాలక సంఘ అధ్యక్షురాలు సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన ఏప్రిల్2026 మాసము కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జగిత్యాల పట్టణములో రాబోవు వర్ష కాలము దృష్ట్యా పట్టణ పారిశుద్యమునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, కెమికల్స్, ఫాగింగ్ మెషిన్స్ కొనుగోలు నిమిత్తం రూ.90 లక్షల నిధులు,బక్రీద్ పండుగ సందర్భముగా ఆహ్లాదబరిత వాతవరణములో పండుగ జరుపుకోవడమే ప్రదానముగా పురపాలక సంఘ ఆద్వర్యములో ప్రత్యేక ఏర్పాట్లకుగాను రూ 6 లక్షల నిధులు సమకూరుస్తున్నట్లు వివరించారు. సమావేశములో వైస్ చేర్మెన్ జీనత్ పర్వీన్, స్పందన,తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆపే ప్రసక్తే లేదు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లామని ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని లేకుంటే సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమ ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనరల్ సెక్రటరీ ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు శుక్రవారం టియూఎఫ్ ఉద్యమ ఫోరం హుజూరాబాద్ నియోజకవర్గస్థాయి సమావేశం జమ్మికుంట శంకరనందన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశిస్తూ తెలంగాణ ఉద్యమకారుల పోరం జనరల్ సెక్రటరీ ఎక్కటీ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోజు తెలంగాణ ఉద్యమంలో ఎఫ్ ఐ ఆర్ అయిన వాళ్ళనే కాకుండా ఉద్యమం కొరకు పాటుపడ్డ వారిని కూడా గుర్తించడానికి ఒక కమిటి ఏర్పాటుచేసి గుర్తించనున్నట్లు తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ మేనిఫెస్టో లో పెట్టిన హామీలను నెరవేర్చాలని టియూఎఫ్ ఆధ్వర్యంలో ఈ మధ్యకాలం లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్సీ కోదండరాం రాష్ట్ర ముఖ్య మంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, కమిటీ ఏర్పాటు చేసి తీపి కబురు చెప్పే అవకాశం ఉందని తెలిపారు. అలాగే టియూఎఫ్ సంస్థను పూర్తి స్థాయిలో బలోపేతం చేయడానికి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఎక్కటి సంజీవరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నకిర్తరాజు, జక్కే కిరణ్, కందికట్ల మధుసూదన్, మూడేళ్ల కుమారస్వామి, లక్ష్మీ రవీందర్, కొండా అర్జున్ పాల్గొన్నారు. ఉప సర్పంచులు కొండల్ రెడ్డి, రాజు, రజనీకాంత్, చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్వేశం, శ్రీనివాస్ మార్కెట్ అధ్యక్షులు, పిఏసిఎస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరే రమేష్ రెడ్డి, నీల నాగరాజు, కన్నవేణి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ ప్రమాదకరం జాగ్రత్తలతో నివారణ సాధ్యం పోస్టర్ ఆవిష్కరించిన

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుత ఎండాకాలం దృశ్య తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలకు గాను ఏర్పాటు చేసిన వడదెబ్బ ప్రమాదకరం జాగ్రత్తలతో నివారణ సాధ్యం అనే పోస్టర్ ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ ప్రస్తుత ఎండాకాలం దృశ్య అవసరం ఉంటే కానీ బయటకు రావద్దని ఏదైనా అవసరాల మీద బయటకు వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని తలకు, చెవులకు ఏదైనా టవల్ లాంటివి కట్టుకోవాలని సమానుకులం దప్పిక తీర్చే నీరు కానీ నిమ్మరసం లాంటివి తగలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్స్ ఫిరోజ్, చింతల శ్రీనివాస్, డాక్టర్ గొట్టే శ్రావణ్ కుమార్, డిప్యూటి డిఎంహెచ్ఓ సదానందం, ప్రతాప్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎఎంసి చైర్మన్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ ముల్కల శిరీష శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని,కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని,రైతులు విశ్రాంతి తీసుకునేలా షెడ్డు ఏర్పాటు చేయాలని కొనుగోలు నిర్వాహకులకు సూచించారు . రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్వహిస్తున్న వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముల్కల శిరీష శ్రీనివాస్ ,ఉప సర్పంచ్ అవునూరి శ్రీధర్ ,వార్డు సభ్యులు సాంబర్ గణేష్ ,సామల లలిత ,సిసి మల్లేశం ,మాదాసు గంగారం ,ముల్కల లక్ష్మి ,కనపర్తి శ్రీనివాసరావు ,వివో ఏ సునీత,గ్రామ ప్రజలు, రైతులు ,యువకులు ,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ వరప్రసాద్ రైతులను కోరారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో శుక్రవారం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ చైర్మన్ కుంభాల రాజరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, సర్పంచ్ పుప్పాల లక్ష్మి మహేష్, ఉపసర్పంచ్ రాపల్లి మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్,వార్డు సభ్యులు బైండ్ల విశాల్, రైతులు, పాల్గొన్నారు.

## పిఎసిఎస్‌లోఎన్నికలు జరిపి రైతులకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ఎన్నికల నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనని మండల బి.ఆర్.ఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు కనీస ఆర్థిక సహాయం చేయకుండా రైతుల ద్వారా నడిచే పిఎసిఎస్ లపై పెత్తనం చెలాయిస్తూ వారి స్వార్థప్రయోజన కోసం ఎన్నికలు జరపకుండా నామినేటెడ్ పదవుల విధానం తేవడం సరికాదన్నారు. రైతులకు రైతుబంధు ఇవ్వకుండా ధాన్యం సరిగా కొనుగోలు చేయకుండా ఉండడంతో,క్షేత్రస్థాయిలో అనుకూల పరిస్థితులు లేనందునే ప్రభుత్వం నామినేటెడ్ విధానానికి ఎత్తుగడ వేసిందని, సహకార సంఘాల్లో ప్రజాస్వామ్యతమైన ఎన్నికల ప్రక్రియ పక్కనపెట్టి ఇలాంటి విధానాలు అనుసరించడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శరత్, చిట్టాపూర్ సిరిపూర్ మాజీ చైర్మన్లు,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి గౌడ్, సతీష్,పెద్దిరెడ్డి లక్ష్మణ్ ,కొంపల్లి రాజు, ముత్యం రెడ్డి, ఆదిరెడ్డి, ఉయ్యాల లక్ష్మణ్, భూమా రెడ్డి, ప్రేమ్,రమేష్,హనుమంతు,తదితరులు ఉన్నారు.

# రాయికల్‌లో బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

**ప్రజాపక్షం/రాయికల్ :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ, శుక్రవారం గాంధీ చౌక్ వద్ద బి.ఆర్.యస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.ఈ సందర్బంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు రూపశిల్పి, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ తీర్పు తెలంగాణ ప్రజల విజయమని, ప్రాజెక్టుపై జరిగిన అసత్య ప్రచారాలకు హైకోర్టు తీర్పుతో చెక్ పడిందని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టి వల్లనే కోట్లాది ఎకరాలకు సాగునీరు అందుతోందని వారు కొనియాడారు.ఈ



కార్యక్రమంలో రాయికల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్, బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్,మ్యాకల రమేష్,కొయ్యడి మహిపాల్,ఎద్దండి దివాకర్,వల్లకొండ మహేష్, బత్తిని నాగరాజు, మణికంత,పొట్టవతిని శ్రీధర్, కొక్కుల రంజిత్లతో పాటు మండల మరియు పట్టణ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయంలో వేలం ద్వారా ఆదాయం

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ కార్య నిర్వహణ కార్యలయం లో శుక్రవారం వేలం నిర్వహించారు. వేలం ద్వారా కొబ్బరికాయలు రూ42వేలు, మాలల ద్వారా 5లక్షల 5వేలు, బియ్యం కిలోకు 17 రూపాయిలు చొప్పున , గంటలు కిలోకు 765 రూపాయిలు, ఎండు కూడకలు కిలోకి 130 చొప్పున, ఖాళీ నూనె డబ్బాలు ఒక్కోటికి21 రూపాయిలు వేలం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్.అంజనా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ హరిహర్నాథ్, సూపరిండేంట్ సునీల్, ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, ఏసీ కార్యాలయం ఇన్స్పెక్టర్ రాజమౌళి, చెక్కిళ్ళ అశోక్, రామేశ్వర్ రావు,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**ప్రజాపక్షం/రాయికల్:** ప్రగతి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఇందులో భాగంగా ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించి వారికి మెమెంటోలు యాజమాన్యం అందజేసింది.ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ వారి కృషిని కొనియాడింది. నర్సరీ నుండి 9వ తరగతి వరకు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. యూకేజీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాలలో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు హాజరయ్యారు.

## నూతన తహసిల్దార్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ మండల నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన రామచందర్ ను సాతారం గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్వోను కలిసిన వారిలో సర్పంచ్ నారాయణ గౌడ్, మాజీ ఎంపిటిసి గున్నాల శ్రీనివాస్,గంగాధర్ తదితరులున్నారు.

## పిఎం శ్రీ ఎంపిపిఎస్‌లో ఘనంగా వార్షికోత్సవం

**ప్రజాపక్షం/కథలాపూర్:** పీఎం శ్రీ ఎంపీపీఎస్ పోతారం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులచే సాంస్కృతిక నృత్యాలు,పాటలు, కరాటే, యోగ ప్రదర్శించబడ్డాయి కార్యక్రమాలు ఉత్సాహభరితంగా తల్లిదండ్రులను అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీమతి ప్రమీల సుదర్శన్ ఈ సంవత్సరం నుండి గత సంవత్సరం పాఠశాల 5 వ తరగతి లో మొదటి, రెండవ స్థానం పొందిన విద్యార్థులకు రూపాయలు 1500,1000 మరియు షీల్డ్ లు అందిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ శ్రీమతి ధర్మపురి స్వప్న జలంధర్ ,ఉపసర్పంచ్ అన్నారపు నర్సయ్య ,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పులి శిరీష హరిప్రసాద్, ఏఏపి సి చైర్మన్ లావణ్య కార్యక్రమాలను ఆద్యంతం తిలకించి పిల్లలను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ప్రభుత్వ పాఠశాలలో నమోదు పెంచాలని కోరారు. పాఠశాలకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాల లో ఉన్నత ప్రతిభ కనబరచిన పిల్లలకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం,సిఆర్పీ లు, గ్రామ పెద్దలు నరేందర్ , ఇంద్రాల రాము విద్యార్థులు, మరియు గ్రామ వివోఏ లు తిరుమల, సుజాత లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి వెన్నుదన్నుగా నిలిచిన రాస ప్రవీణ్ మరియు బిట్టుగు గంగాధర్ లను పాఠశాల సిబ్బంది సన్మానించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా స్పార్క్ 2026 వార్షికోత్సవ బహుమతులు అందించడం జరిగింది. పాఠశాలను అభివృద్ధి పథం లో నిలుపుతున్న పాఠశాల సిబ్బందిని గ్రామపాలక వర్గం ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.




## మూఢనమ్మకాలు విడనాడేది ఇంకెన్నడు..?

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పక్కనే గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ మూడు రంగుల అన్నం ముద్దలు,నిమ్మకాయలు, కోడి గుడ్లు,కొబ్బరికాయ, రక్తపు మడుగులతో ఎవరైనా శుద్ర పూజలు చేశారా.? లేక ఎవరికైనా అనారోగ్య సమస్య ఉంటే ఇలా వారి మొక్కుబడి పూజలు చేశారా .? ఏదిఏమైనా ఈ పూజలు నిర్వహించిన ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణం పక్కనే మూడు రంగుల ముగ్గులు వేసి,వాటి మధ్యలో నిమ్మకాయలు, కోడిగుడ్లు, కొబ్బరికాయలు, పసుపు,కుంకుమను, నలుపు రంగు పెద్ద ముద్దలు ఉంచి ప్రత్యేక పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ప్రస్తుతం కళాశాలకు సెలవులు కాగాఉదయం అటువైపు వచ్చిన గ్రామస్తులు ఈ దృశ్యాలను చూసి భయాందోళనకు గురయ్యారు. విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల ఆవరణలో ఇలాంటి మూఢనమ్మకాలతో కూడిన చర్యలు జరగడంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు,ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఘనంగా ప్రారంభించారు. పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం, సర్వారం, పోతారం, మైదంబండ, సీతంపల్లి, అడవి శ్రీరాంపూర్, ముత్తారం, ఓడేడు, ఖమ్మంపల్లి తోపాటు తదితర గ్రామాల్లో కమాన్ పూర్ గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, సర్పంచులు, ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని,ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు,నీడ, టార్పాలిన్లు వంటి కనీస వసతులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాల మేరకు ఉండాలని, తేమ శాతం విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఐకెపి ఎపిఎం,వ్యవసాయ సంఘాల నాయకులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## ఉత్తమ ప్రతిభకు అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల ఇందు అనే విద్యార్థిని కాలేజ్ మేంటర్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఆన్లైన్ పోటీల పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచగా అరుదైన గౌరవం అందుకుంది. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన గాండ్ల ఇందుకు విజయవాడలో జరిగిన కాలేజ్ మేంటర్ అవార్డు కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రాజశేఖర్ చేతుల మీదుగా 25వేల స్కాలర్షిప్ చెక్కును అందించి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. చిన్ననాటి నుండి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషదాయకమని పలువురు గాండ్ల ఇందూను అభినందించి హర్ష వ్యక్తం చేశారు.

## మండల వ్యాప్తంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల గ్రామపంచాయతీలో వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించుకుని పంచాయతీరాజ్ దినోత్సవ ఆవశ్యకతను సర్పంచ్ లక్ష్మ ణ్ వివరించారు. క్షేత్రస్థాయిలో నిధుల సమీకరణ ప్రణాళిక రూపొందించడం పాలకులలో జవాబుదారితనాన్ని పెంపొందించేందుకు సుపరిపాలన నెలకొల్పేందుకు ఈ వ్యవస్థ ఎంతో దోహదం చేస్తుందని పంచాయతీ వ్యవస్థ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాలకవర్గ సభ్యులు,తదితరులు ఉన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న రామగుండం ఎమ్మెల్యే సతీమణి

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు అంజన్న ఆలయాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సతీమణి మనాలి శుక్రవారం దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 453 గ్రాముల వెండి తో తయారు చేసిన రూ.1లక్ష 38 వేల విలువ గల గదను అంజన్నకు భక్తి భావంతో బహుకరించారు.ఆలయ అర్చకులు ఆమెకు వేదోక్త ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, ముఖ్య అర్చకులు రాము, టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిల్ల అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అభయహస్తం' హామీ ఏమైంది?



**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 'అంబేద్కర్ అభయహస్తం' హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంథని నియోజకవర్గ దళితులు పాదయాత్రకు సిద్ధమవుతున్నారు.మేనిఫెస్టో కమిటీ చైర్మన్ ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే అయినందున, ఇక్కడి నుండే తమ నిరసన గళాన్ని వినిపిస్తామని రాష్ట్ర దళిత బంధు సాధన సమితి స్పష్టం చేసింది.ప్రధాన డిమాండ్లు, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందించాలి.ప్రభుత్వం ఏర్పడి ఇంత కాలం గడుస్తున్నా, ఈ పథకం కింద ఎంతమందికి లబ్ధి చేకూరిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కమాన్‌పూర్ నుండి మంథనిలోని అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించి, అక్కడ వినతిపత్రం అందజేయనున్నారు.గత ప్రభుత్వం దళితులను ఆదుకుందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని నేతలు విమర్శించారు.దళితులు తిరగబడితే ఎలా ఉంటుందో ప్రభుత్వానికి చూపిస్తామని వారు హెచ్చరించారు.త్వరలోనే ఈ పాదయాత్ర తేదీని ప్రకటిస్తామని రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోయిల మహేష్,గద్దల శంకర్, ఊట్ల శ్రీను తెలిపారు.

## గ్రామ పంచాయతీలో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గ్రామ పంచాయతీ కూలీలు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు, పనులకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్ సూచించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ పంచాయతీ సిబ్బందికి, గ్రామస్తులకు గ్రామ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ఫ్యాకెట్లను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పంచాయతీ, ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపి ధరించడం, మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సందీప్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన గ్రామస్తులు

### జాన్కంపేట్ గ్రామ సభలో ప్రజల నిలదీతలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా జరుపుతారు. ఈ సవరణ వల్ల గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ హోదాతో పాటు స్తానిక స్వపరిపాలన బలపడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా, పలు గ్రామాల్లో పాలకవర్గం సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో పలు సమస్యలపై ప్రజలు గ్రామ కార్యదర్శిని పాలకవర్గాన్ని ప్రశ్నించారు. గ్రామంలో అక్రమ వెంచర్లు, అనుమతులు లేని వ్యాపార సముదాయాలు, ఫ్యాక్టరీలు, అనుమతులు లేని నిర్మాణాలు వంటి వాటిపై గ్రామ పంచాయతీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జిపి కార్యదర్శి సందీప్‌ను ప్రశ్నించారు. అంతేగాకుండా అక్రమ వెంచర్లలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో అక్రమంగా వెలిసిన లే అవుట్ లేని ప్లాట్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అంతర్యమేమిటని గ్రామస్తులు ప్రశ్నించగా వెంచర్ ఏర్పాటులో గత పాలకులకు, పలువురికి డబ్బులు ఇచ్చామని గ్రామసభ సాక్షిగా వెంచర్ నిర్వహకులు తెల్పడం గమనార్హం. అంతేగాకుండా ఎల్ఆర్ఎస్ కట్టుకుంటే జిపికి పది శాతం భూమి ఇవ్వనవరం లేదంటూ జిపి కార్యదర్శి సందీప్ తెల్పడం హాస్యాస్పదంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అలాగే అయితే గ్రామ పంచాయతీ నుంచి గాని, పరిశ్రమల శాఖ నుంచి గాని ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రామంలో పరిశ్రమలు వెలుస్తున్నాయని వీటికి అనుమతులు లేకుండా ఎలా కొనసాగుతున్నాయని గ్రామస్తులు సెక్రెటరీని నిలదీయగా ఈ విషయమై జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశామని వాటికి పన్నులు విధించాలని ఆదేశించారని సెక్రెటరి తెలిపారు. ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని గ్రామస్తులు పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి, స్థానిక అభివృద్ధిపై చర్చించారు. గుండంపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన సభలో సర్పంచ్ తక్కల రమణారెడ్డి, ఎంపిఓ, గోవర్ధన్ మరియు పంచాయతీ కార్యదర్శి స్వాతీ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాల సమగ్రఅభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. గ్రామ సభల వేదికగా ''ఆత్మ నిర్భర్ భారత్'' కింద వ్యవసాయం మరియు చిన్న తరహా పరిశ్రమల (MSME)అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న కీలక చర్యల గురించి ఎంపిఓ గోవర్ధన్ ప్రజలకు వివరించారు. వ్యవసాయ మౌళిక సదుపాయాల నిధి కోసం లక్ష కోట్లు కేటాయించడం పశు సంవర్ధక మరియు మత్స్య సంపద యోజన వంటి పథకాల ద్వారా రైతుల ఆదాయాన్ని పంఎచడంపై అవగాహన కల్పించారు. అలాగే చిన్న తరహా పరిశ్రమలకు పూచికత్తు లేని రుణాలు అందించడం ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందని తెలిపారు. విదేశీ దిగుమతులను తగ్గించి భారతీయ ఉత్పత్తులను ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ అవకాశాలను గ్రామీన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని జలాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం సర్పంచ్ గుండేటి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వపాఠశాలలోనే దొరుకుతుందని రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం కృషి చేస్తానన్నారు. ఎంఈఓ రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎంతో సహకరిస్తుందన్నారు.పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్క విద్యార్థి తల్లిదండ్రులు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ప్రతిభా కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కిషన్, వార్డు సభ్యులు దేవాదాయ కమిటీ ఉపాధ్యాయులు మధు, కృపాని, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల పరిశీలన



**ప్రజాపక్షం/బోధన్:** అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణానికి ఈ స్థలాన్ని ఖరారు చేసినందున, శంకుస్థాపన కార్యక్రమాన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని ఆధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకవస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే మంజూరైన బోధన్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, డీఈ రాందాస్, తహసీల్దార్ విఠల్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

### వామపక్ష పార్టీల డిమాండ్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:** ఆర్‌టిసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అన్నారు. శుక్రవారం స్తానిక ఆర్అండ్‌బి గెస్టు హౌస్‌లో సిపిఐ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఆర్‌టిసి సమ్మెకు మద్దతుగా రౌండ్ టేండ్ సమావేశాన్ని వివిధ వామపక్ష పార్టీలతో నిర్వహించారు. రౌండ్ టేండ్ సమావేశాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఐఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి, సిపిఐఎంఎల్ మాస్ లైన్, బిఎల్‌పి, ఎంసిపిఐ, ఆర్ఎస్‌పి, జమాతే ఇస్లామి హింద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయకపోగా, గత ప్రభుత్వంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించడం లేదన్నారు. నూతన వేతన సవరణకు కాలయాపన, ఆర్‌టిసిలో కొత్తగావస్తున్న బ్యాటరీ బస్సులను (ఎలక్ట్రిక్ బస్సులను) ప్రయివేటు రంగాలకు అప్పజెప్పకుండా ప్రభుత్వమే నడపాలన్న ప్రధాన డిమాండ్లతో ఆర్‌టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు వామపక్ష పార్టీల పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు కార్మికుల డిమాండ్ల సాధనకు త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిచో ఆర్‌టిసి సమ్మెలో వామపక్ష ప్రజా సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాన్ని ఉదృతం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్‌టిసి జేఏసి నాయకులు శ్రీనివాస్, సంజీవ్, వామపక్ష పార్టీల నాయకులు వై.ఓమయ్య, శ్రీనివాస్, రాములు, అనిల్, హుస్సేన్, కోయిడి నర్సింలు, రఘురాం, ఫిరోజ్ అలీ, సురేష్, గణేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో పెట్రోల్, డీజిల్ కొరత

**ప్రజాపక్షం/ లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిండుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ మాహనాల్లో ఇంధనం నింపుకోవడానికి దాదాపు 3 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తుందని వనియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పెట్రోల్ బంకుల వద్ద వాహానాల రద్దీ పెరగడం, స్టాక్ తక్కువగా ఉండటంతో పనులకు వెళ్ళేవారు , రైతులు సకాలంలో తమ గమ్య స్థానాలకు చేరుకోలేక పోతున్నారు. ముఖ్యంగా అత్యవసర పనుల మీద వెళ్ళేవారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడాలని సరైన సమయానికి ఇందనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వాహన వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## నిర్మల్ జీజీహెచ్‌లో చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రోగులు మరియు వారి సహాయకుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెడెంట్ డా॥గోపాల్ సింగ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.ఓ. డా.రమేష్, డా॥ విశ్వనాథ్, నర్సింగ్ సూపరింటెడెంట్లు వనజ, విజయలక్ష్మీ అలాగే ఆఫీస్ సూపరింటెడెంట్ నవీన్ పాల్గొన్నారు. వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడకుండా ఉచితంగా శుద్దమైన తాగునీరు అందించేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వారు సూచించారు.

## బస్సులు బంద్‌తో ఇబ్బందుల్లో పల్లె ప్రజలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** ఆర్టీసీ కార్మికులు వారి సమస్యల సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా బస్సులు నిలిపివేయడంతో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్సులు పట్టణాల్లోనే నడవకపోవడం కాకుండా పల్లెలో కూడా బస్సులు నడవకపోవడం వల్ల పల్లెలోని ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి వెళ్లాలంటే బస్సులు అవసరమని ఆర్టీసీ సిబ్బంది బస్సులు నిలిపివేయడంతో ఇతర గ్రామాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్సులు లేక అవస్థలకు గురవుతూ వాహానాలను ఆశ్రయిస్తున్నారు. పల్లెల్లో ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు ప్రైవేట్ టోలలో వెళ్తున్నారు. సమయానికి ఆటోలు లేక కూడా ఎంతో అవస్థల పాలు అవుతున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. బస్సులు నడవక ఆర్టీసీ బస్టాండ్ లన్నీ బోసిపోయి కనబడుతున్నాయి. అధికారులు ప్రైవేట్ డ్రైవర్లతో కొన్ని బస్సులు నడుపుతున్నప్పటికీ ఆ బస్సులు ఎప్పుడు వస్తున్నాయో తెలియడం లేదని దీంతో బస్టాండ్లలో వేచి ఉన్న ఆటోలను ఆశ్రయించి ప్రయాణించాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఏదేమైనా ప్రభుత్వం ఆర్టీసీ సమ్మెను విరమింప చేసి బస్సులు నడిపి ప్రయాణికుల కష్టాలను తీర్చాల్సింది ఏంతైనా ఉంది మరీ.

## ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాదయాత్ర

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ సాధనే లక్ష్యంగా, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న నిజామాబాద్ జిల్లా సమితి నుండి పాదయాత్ర చేపట్టనున్నట్టు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. శుక్రవారం స్తానిక ఆర్అండ్‌బి గెస్టు హౌస్‌లో పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ సాధనకై ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర గోడ ప్రతులను విడుదల చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8300 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ బకాయిలు ఉండడం వల్ల ఈరోజు పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్తితి ఉందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాస్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రను విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి సభ్యుడు కిషోర్, నగర నాయకులు శివ, కార్తీక్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

సర్పంచ్ కాట్లే మంజుల మధుకర్

**ప్రజాపక్షం/తిర్యాని :** గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కాట్లే మంజుల మధుకర్ కోరారు. కొమురం భీం జిల్లా తిర్యాని మండలం కొటగాం గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలోని చేతిపంపుల వద్ద కల్వట్లు నిర్మించాలని, రెండు ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు సభలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట్ల కొత్తగా బోర్వెల్లు త్రవ్విస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాలను బలోపేతం చేయడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాందేవ్, ఉపసర్పంచ్ జ్యోతిరామ్, వార్డు సభ్యులు వాసశ్రీ, శ్రీదేవి, నైతం రేణుక, కమల, భీము, లలిత పాల్గొన్నారు.

## అమరుడు భీమయ్యకు ఘన నివాళులు

**ప్రజాపక్షం/కాసిపేట :** ఆదివాసి అమరుడు చేనేని భీమయ్య చేసిన పోరాటాలు మరువలేనివని ఆదివాసి నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు తెలిపారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మద్దిమాడలో శుక్రవారం భీమయ్య 38వ వర్ధంతి వేడుకలను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీమయ్య ప్రాణత్యాగం ఫలితంగానే జిల్లాలో అటవీ అధికారుల వేధింపులు తగ్గాయని పేర్కొన్నారు. అమరుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, చట్టాల అమలు కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడ దివ్య, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తత్ర భీంరావు, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, మండల అధ్యక్షులు బద్ది శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్, మడవి రమేష్, ఉపసర్పంచ్ బిర్నైని భీమయ్య, ఫారెస్ట్ ఆఫీసర్ సురేష్, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

## సమ్మెను శాంతియుతంగా కొనసాగించాలి

పోలీస్ సూపరింటెండెంట్ నికిత పంత్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆర్‌టిసి సమ్మెను కార్మికులు శాంతియుతంగా కొనసాగించాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నికిత పంత్ సూచించారు. ఆసిఫాబాద్ ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొంటున్న కార్మికులతో ఆమె మాట్లాడారు. ఎవరూ కూడా క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఆందోళనలు శాంతియుత మార్గంలో ఉండాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు తావు లేకుండా నిరసన తెలపాలని స్పష్టం చేశారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ ఎస్ఐ సురేష్, ఎస్ఐ అనిల్ కుమార్



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎస్ఐ సురేష్, ఎస్ఐ అనిల్ కుమార్ సూచించారు. పెంచికల్‌పేట్ మండలం దరోగపల్లి గ్రామంలో గంజాయి, గుడుంబా నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యసనాల వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, గుడుంబా వంటి నిషేధిత పదార్థాల సరఫరా లేదా వినియోగంలో ఎవరైనా పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మత్తు పదార్థాల విక్రయాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి హరీష్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

కేసరి ఆంజనేయులు గౌడ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆర్‌టిసి డ్రైవర్ కొల శంకర్ గౌడ్ ఆత్మహత్యకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మోకు దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్ విమర్శించారు. నర్సంపేట మండల కేంద్రంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల కోసం కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే ఇలాంటి విషాద ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ల గడిచినా పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. భూపాలపల్లి, నల్లగొండ, ఖమ్మం ప్రాంతాల్లోనూ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, వీటన్నింటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సమ్మెను గౌరవప్రదంగా పరిష్కరించి, కార్మికుల డిమాండ్లను ఆమోదించాలని కోరారు. ఆర్‌టిసి కార్మికుల పోరాటానికి మోకుదెబ్బ, తెలంగాణ గౌడ సంఘాల జెఎసి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బండారి రమేష్ గౌడ్, నగునూరి నీరజ గౌడ్, కొండ్ర మనోహర్ గౌడ్, బండారి లావణ్య గౌడ్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలి

మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వరరావు



**ప్రజాపక్షం/మందమర్రి :** ఉపాధి హామీ పనులను కొలతల ప్రకారం నాణ్యతతో నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వరరావు సూచించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం అందుగులపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆయన ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి రూ. 307 వేతనం అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. పనుల నిర్వహణలో ఎక్కడా అలసత్వం వహించకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో పైకప్పు స్థాయి వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన సందర్శించారు. లబ్ధిదారులు మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, గడువులోగా పూర్తి చేస్తేనే పథకం ఉద్దేశం నెరవేరుతుందని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని అధికారులకు హితవు పలికారు.

# ఇష్టపడి చదివితేనే లక్ష్య సాధన సాధ్యం

పాఠశాల డైరెక్టర్ హిమబిందు

**ప్రజాపక్షం/రెబ్బెన :** విద్యార్థులు చిన్నతనం నుండి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ హిమబిందు తెలిపారు. రెబ్బెన మండల కేంద్రంలోని పాఠశాలలో శుక్రవారం ప్రమోషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించాలని, వారి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. లక్నోలోని సిటీ మాంటిసోరి స్కూల్ నుండి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తారని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కంది శ్రీనివాస్‌రెడ్డికు వినతి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ రిమ్స్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తొమ్మిది నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ కావడం లేదని, సీనియార్టీ ప్రకారం పేషెంట్ కేర్ ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు బయటి వ్యక్తులకు ఇస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తే అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పిర్యాదు చేశారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమ, కుంటాల రాములు, అనసూయ, రుక్మిణి, పుష్పలత, రాధా, మోహన్, అనిత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండల వ్యాప్తంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. మండలంలోని లక్కంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సేడ్మకి సుజాత గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు వంటి వివిధ సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి కార్మికులకు మజ్జిగ పంపిణీ

సర్పంచ్ సుతారి సుమలత

**ప్రజాపక్షం/జన్నారం :** వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కార్మికులు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సుతారి సుమలత సూచించారు. జన్నారం మండలం చింతగూడ గ్రామంలో పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ఆమె మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో కార్మికులకు ఇబ్బంది కలగకుండా నీడ కోసం నెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. వేసవి కాలంలో తగినంత నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పని ప్రదేశంలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్, గ్రామ కార్యదర్శి రాజన్న, ఉప సర్పంచ్ అసంపెల్లి కావ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**ప్రజాపక్షం/తిర్యాని :** గ్రామ అభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ పాత్ర కీలకమని సర్పంచ్ పార్వతి అంబారావు తెలిపారు. కొమురం భీం జిల్లా తిర్యాని మండలం ఎదులపాడు గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు.ప్రజల్లో అవగాహన పెంపొందితేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని వివరించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాముఖ్యత, ప్రజాప్రతినిధుల బాధ్యతలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.పంచాయతీ కార్యదర్శి అశోక్, సభ్యులు భగవంతురావు, రాజేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా బూరి పోచమ్మ జాతర

**ప్రజాపక్షం/తిర్యాని :** కొమురం భీం జిల్లా తీర్యాని మండలం మంగి గ్రామపంచాయతీ పరిధిలోని కొలం గూడలో బూరి పోచమ్మ జాతరను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో కొలం గూడ వాసులు భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాలు పడే సమయం, పంటల సాగుపై దేవతను ప్రార్థించి ఆశీర్వాదం పొందిన తర్వాతే విత్తనాలు వేస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మారు పోసు, భీమావ్వ, కొండు చిన్ను, భగవంతరావు, బొజ్జి రావు తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలోని మక్క కొనుగోలు కేంద్రం

**ప్రజాపక్షం / భైంసా :** ఇచ్చిన మాట ప్రకారం ఎం.ఎల్.ఏ రామారావు పటేల్ భైంసా లోని మక్క ఒనుగోలు కేంద్రాన్ని కమలాపూర్ గుట్ట పక్కన ఉన్న మినీ స్టేడియంలో సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయిచడం జరిగింది. వారికి రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మెన్ తుమ్మల దత్తు, బిజెపి టౌన్ అధ్యక్షులు రావుల రాము, కిసాన్ గల్లి సర్పంచ్ కుంట రాజలింగు , ఉప సర్పంచ్ దిపోల్ల సాయినాథ్ , కౌన్సిలర్ నిమ్మల ప్రవీణ్ , వడ్నపు శ్రీనివాసు, అల్లెం దిలీప్ , జె. రాహుల్ , చర్ల సుభాష్ , మామిడి స్వామి , సిద్దూర్ సర్పంచ్ సుధాకర్ , అల్లకొండ సతీష్ , బొల్మెట్టి రాజు, బొల్మెట్టి రాజేశ్వర్ నైతులు పాల్గొన్నారు.

## గ్రామ బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ , జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న ఆదేశాల మేరకు నిర్మల్ మండలంలోని అక్కాపూర్, మూఠాపూర్ గ్రామాల్లో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది.పిల్లలపై జరుగుతున్న హింసను అరికట్టి వారిని రక్షించడం, పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్ళేలా చూడడం మరియు చట్టబద్ధమైన దత్తత వంటి అంశాలపై అధికారుల బృందం విస్తృత అవగాహన కల్పించింది. గ్రామ కార్యదర్శి మరియు గ్రామ సర్పంచుల సమక్షంలో కమిటీ ఏర్పాటుకు సంబందించి అధికారికంగా తీర్మాణం చేయడం జరిగింది.

## కాల్వ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని కాల్వ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పనులు పూర్తి చేసుకొని శుక్రవారం రోజున నల్గురు లబ్దిదారులు ప్రియాంక, మంద కమల, వడ్ల వినోద, కార్తిక, ఇందిరమ్మ గృహ ప్రవేశాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగరి రోజా, ఉప సర్పంచ్ హరికృష్ణ ఎంపిడిఓ అరుణ రాణి, ఎంపిఓ గోవర్దన్, హౌజింగ్ ఏఇ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ కాంగ్రెస్ నాయకులు బేకరి సుధాకర్ లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** తమ న్యాయమైన హక్కుల సాధనం కోసం సమ్మె చేస్తున్న ఆర్టీసి ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు ప్రారంభించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని నిర్మల్ జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేకర్ డిమాండ్ చేశారు. తమ హక్కులను సాధించుకునేందుకు సాగుతున్న పోరాటంలో భాగంగా ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ అసువులు బాయడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, ఆ కుటుంబానికి అవసరమైన పూర్తి చేయూతను అందించి అండగా నిలవాలని కోరారు.

## పంచాయతీరాజ్ దినోత్సవానికి సర్పంచ్, ఉప సర్పంచ్ గైర్హాజరు



**ప్రజాపక్షం/జైపూర్ :** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలకు సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరుకాకపోవడంపై వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలను గుర్తించి, పంచాయతీ రాజ్ చట్టం, నిధులు, విధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా.. సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరూ రాకపోవడం చర్చనీయాంశమైంది. పంచాయతీ కార్యదర్శి ఒకరోజు ముందే సమాచారం అందించినప్పటికీ, వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని వార్డు సభ్యులు పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇలాంటి ముఖ్యమైన కార్యక్రమాలను విస్మరించడం వల్ల గ్రామ అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. రానున్న రోజుల్లో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటస్వామి, సంతోష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన

### ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిహెచ్ఓ రాజేశ్వర్ సూచన



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని దిలావర్‌పూర్ సమీపంలో గల పోచమ్మ చెరువు ప్రాంతంలో ఉపాది హామీ పనులు చేస్తున్న కూలీలకు ఎండ తీవ్రత ,వడదెబ్బపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్ ఈ కార్యక్రమంలో పాల్గొని కూలీలకు పలు జాగ్రత్తలు సూచించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున పనుల సమయంలో తలపై తప్పనిసరిగా రుమాలు లేదా టోపి ధరించాలని , నలుపు రంగు దుస్తులకు దూరంగా ఉండి కాటన్ మరియు లేత రంగు వదులుగా ఉండే దస్తులను ధరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా పనిచేసే ప్రదేశంలో నీటిని వీలైనంత ఎక్కువగా తాగాలని ఉదయం 11గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల తర్వాత మాత్రమే పనులు చేసుకునేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైతే వారిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి తరలించి శరీరాన్ని చల్లబరచాలని రాజేశ్వర్ తెలిపారు. అందుబాటులో ఉన్న (ORS) ప్యాకెట్లను నీటిలో కలిపి తాగించాలని ప్రాథమిక చికిత్స అనంతరం వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాది హామీ వి.ఓ. శ్రీనివాస్, కూలీలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్ద మొత్తంలో మొక్కజొన్న సబ్ సెంటర్‌ల ఏర్పాటు

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/ భైంసా :** బహిరంగ మార్కెట్లలో పంటలకు ధరలేనందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో తమ పంటలను అమ్ముకోవాలని ఎం.ఎల్.ఏ పవార్ రామారావు పటేల్ రైతులకు సూచించారు. మార్కెట్ లో మొక్కజొన్న పంటకు ధర లేకపోవడంతో సబ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పెద్ద మొత్తంలో రైతుల నుండి వినతి పత్రాలు రావడంతో ఆయన గత రెండు రోజుల నుండి హైదరాబాదులోనే ఉంటూ మంత్రులను, అధికారులను కలుస్తూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నారు. రైతుకు ఇబ్బందులు కలగకుండా ఆయన అన్ని చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలతో పాటుసోమవారం నుండి జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువ ఉన్నందున తమ పంటను అమ్ముకొని రైతులు నష్టపోవద్దని , కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్మాలని, అమ్మకం డబ్బులను సత్వరం ఇప్పించే ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అదే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు వెను వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, అన్ని ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఎం.ఎల్.ఏ వెంట కుంటాల మండల నాయకులు జిటివి రమణా రావు, చిన్నారావు తదితరులు న్నారు.

## ఆర్టీసి కార్మికుల ఉధృత పోరాటం

### ఎండను సైతం లెక్క చేయక నిర్మల్, భైంసా డిపోల ఎదుట భారీ ధర్నా

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ మరియు భైంసా పట్టణాల్లో ఆర్టీసి కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకోవడంతో పోరాటం మరింత ఉధృతమైంది. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలోనూ కార్మికులు డిపోల ఎదుట బైటాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి వివిధ రాజకీయ పార్టీలు మరియు ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి భుక్యా రమేష్ వంటి నేతలు కార్మికుల శిభిరాలను సందర్శించి సంఘీబావం తెలిపారు. సమస్యలు ఆత్మహత్యలతో పరిష్కారం కావని, ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమని పేర్కొంటూ, ప్రాణాలు తీసుకోవద్దని కార్మికులకు దైర్యం చెప్పారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, పెండింగ్ వేతనాలు విడుదల చేయడం మరియు ఉద్యోగ భద్రత కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరారు. ధర్నా అనంతరం కార్మికులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీదుల గుండా సాగిన ఈ ర్యాలీలో కార్మికులు తమ ఆవేదనను చాటారు. ప్రజా సేవలో కీలక పాత్ర పోషిస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, తక్షణమే స్పందించి చర్చలు జరపకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గల్లంతైన వ్యక్తి కోసం డ్రోన్, డాగ్ స్క్వాడ్‌తో గాలింపు

### సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి

**ప్రజాపక్షం/జన్నారం :** గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన గూడ మల్లేష్ ఈ నెల 16 నుండి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జన్నారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని పొలాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ సహాయంతో గోదావరి తీర ప్రాంతాలు, చెట్ల పొదలు, కాలువలను జల్లెడ పట్టారు. సుమారు 100 మంది గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులతో కలిసి గాలింపులో పాల్గొన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు మల్లేష్ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ గాలింపు కార్యక్రమంలో జన్నారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్, దండేపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ తైసీనుద్దీన్, లక్షెట్టిపేట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భారత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సెపక్ తక్రా రిఫ్రీగా మల్లేష్

**ప్రజాపక్షం/రెబ్బన :** మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న 69వ జాతీయ సెపక్ తక్రా సబ్ జూనియర్ (అండర్ 14) పోటీలకు గోలేటికి చెందిన కుమ్మరి మల్లేష్ రిఫ్రీగా ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మల్లేష్ గతంలో తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా కోచ్‌గా, మేనేజర్‌గా సేవలు అందించడమే కాకుండా, 2008, 2009లో జాతీయ స్థాయి రిఫ్రీగా వ్యవహరించారు. 2005లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో క్రీడాకారుడిగానూ ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు రిఫ్రీగా ఎంపికైన మల్లేష్‌ను రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి పి. శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కె. భాస్కర్, ఆర్. రామకృష్ణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. నారాయణ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్. తిరుపతి, రెడ్డి సతీష్, జి. శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు అనిల్ గౌడ్, చందు, రాజశేఖర్, రాజేందర్, గోపి, వెంకటేష్, తిరుమలేష్, చిన్న రాజశేఖర్, నరేష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు తొందరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయాలని కడెం ఎంపిడిఓ సునిత సూచించారు. శుక్రవారం ఖానాపూర్ నియోజకవర్గ కడం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం త్వరగా పూర్తయ్యేటట్లు ప్రజా ప్రతినిధులు అధికారులు చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పాలన ఎంతో తోడ్పడుతుందని, ప్రజా ప్రతినిధుల సహాకారంతో అధికారులు గ్రామాభివృద్ధి జరిగేలా చూడాలని అన్నారు. అదే విధంగా జాతీయ పంచాయతీ రాజ్‌దినోత్సవంలో భాగంగా గ్రామ అధికారులు ప్రజా ప్రతినిధులు ఎంపిడిఓ సునితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈదుల తిరుపతి , ఉప సర్పంచ్ తక్కల రమ్య రవీందర్, హౌజింగ్ ఏ.ఇ. వంశీ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దు

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** చదువుకునే వయసులో వివాహాలు చేయడమంటే అది ఆడపిల్లల అభివృద్ధికి అడ్డుకట్టలాంటిదని ఐసిడిఎస్ అధికారి రాజు పేర్కొన్నారు. ఖానాపూర్ మండలంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుర్జాపూర్, పాత ఎల్లాపూర్ సెక్టార్‌లో గల అంగన్వాడి టీచర్లకు పోషణ పక్షం కంకనోళ్ళు మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని పిల్లలకి ప్రీస్కూల్ కార్యక్రమాలు జరిపించాలని సూచించారు. బాల్య వివాహాల గురించి వివరిస్తూ గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా అంగన్వాడీ టీచర్లు చూడాలని, బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలు కుటుంబ భారాన్ని మోయాల్సి ఉంటుందని అలా బా వివాహాలు చేసే కుటుంబాలను గుర్తించి ఆడపిల్లల్ని చదివించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడున్న సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎలా ముందుకు వెళ్తున్నారో గ్రామాల్లో గల ఆడపిల్లల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు.

## విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం..

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల పరిధిలోని ఎంపీపీఎస్ కంఠాత్మకూర్ గ్రామంలో 2025–26 విద్యాసంవత్సరంలో బెస్ట్ పెర్ఫార్మన్స్ చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించిన పాఠశాల టీచర్లు.ప్రైవేట్ పాఠశాలలు వద్దు..ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని పేరెంట్స్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్ఎం,ఉపాధ్యాయులు కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎంసి చైర్మన్ రజిత,గ్రామ కార్యదర్శి లావణ్య,ఉపాధ్యాయులు,గ్రామ కారోబార్ మామిండ్ల రమేష్,పేరెంట్స్ పాల్గొన్నారు.

## పులిగిళ్ళ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/నడికూడ:** హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో పులిగిళ్ళ గ్రామంలోని ఎంపీయుపిఎస్ పులిగిళ్ళ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ పబ్బ సరిత,ఉపసర్పంచ్ మల్లికార్జున్,వార్డు సభ్యులు కర్ణాకర్,నరేష్ పాల్గొనగా కార్యక్రమం దీపప్రజ్వలనతో ప్రారంభించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి,విద్యార్థుల ప్రగతి గురించి వివరించారు.మండల విద్యాధికారి హనుమంతరావు పాఠశాల అభివృద్ధి, ఉపాధ్యాయుల కృషి,విద్యార్థుల ప్రతిభ గురించి వివరంగా ప్రసంగించారు.పులిగిళ్ళ పాఠశాల పనితీరును ప్రత్యేకంగా అభినందిస్తూ,విద్యార్థుల ప్రతిభ, వారి సామర్థ్యాలను ప్రశంసించారు.ఉపాధ్యాయుల అంకితభావాన్ని కొనియాడుతూ వారి పనితీరు ఆదర్శంగా ఉందని తెలిపారు.బడిబాట కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, పాఠశాలలో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకునేలా కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా బడిబాటకు సంబంధించిన కరపత్రాలు, బ్యానర్‌ను ఆవిష్కరించారు.విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు.కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాలస్వామి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన విలువైన సూచనలు,సలహాలు అందించారు.గ్రామ ఉపసర్పంచ్ మల్లికార్జున్ పాఠశాల సాధిస్తున్న అభివృద్ధిని కొనియాడారు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పిస్తామని హామీ ఇచ్చారు.పాఠశాల వార్షిక నివేదికను కటుకోజ్వల సతీష్ సమర్పించారు.ఈ నివేదికలో పాఠశాల విద్యా ప్రగతి,సౌకర్యాలు,విద్యార్థుల విజయాలు వివరించారు.విద్యార్థులు నృత్యాలు,పాటలు,నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమా,పద్మ,కవిత,ప్రదీప్,రాజేష్,రమేష్,కార్తీక్, అంగన్వాడి టీచర్లు రాజేశ్వరి,అటెండర్ సూరమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సారమ్మ,శైలజ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలి

**ప్రజాపక్షం/జనగామ:**రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కేంద్రానకి ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు. ఎంత మిల్లుకు తరలించారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా అలసత్వం వహించొద్దు అన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు కొనుగోలు చేయాలని, తేమ శాతం రాగానే టోకెన్ ఇవ్వాలన్నారు. సరిపడా గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలని, వెంట వెంటనే ట్యాగ్ చేసి మిల్లులకు ధాన్యాన్ని తరలించాలన్నారు. అలాగే వేసవి ఎండల దృష్ట్యా ప్రతి కేంద్రంలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించాలన్నారు.

**ఇంటింటికి అవగాహన తోనే మలేరియా నియంత్రణ**

మలేరియా నియంత్రణ ఇంటింటికి అవగాహనతోనే సాధ్యమవుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం కావడంతో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరంలో నమోదైన మలేరియా కేసులను విశ్లేషించి ఈ ఏడాది కేసులు తగ్గేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. పారిశుద్యంపై దృష్టి సారించడం, నీరు నిల్వ లేకుండా చూడడం, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్త పేరుకుపోవకుండా చూడడం, పిచ్చి మొక్కలు తొలగించడం వంటివి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, కార్యాలయాలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు ఇతర సంస్థల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సమీక్షలో డిఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, డిపిఓ వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ రంగారావు, జనగామ, స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ మేనేజర్లు రాములు, సత్యనారాయణ, డిడబ్ల్యూ కోదండరాములు, విద్యాశాఖ ఏడి శ్రీనివాస్, సిపిఓ చనకోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/రాయపర్తి:**ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్‌టిసి కార్మికులకు మద్దతుగా బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఆదుకొని అండగా నిలవాలని అన్నారు. లేని పక్షంలో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి, రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపిటిసి ఐత రామ్‌చందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, సంది దేవేందర్ రెడ్డి, పెండ్లి సుధాకర్‌రెడిఉ్డ, చిన్నల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై ఎంఆర్‌పిఎస్ ఫైర్

**ప్రజాపక్షం/నెక్కొండ:**రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య నెక్కొండలో విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజాసేవలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనేందుకు నర్సంపేటలో చోటు చేసుకున్న ఘటనలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నర్సంపేటలో ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ మృతి చెందడం దురదృష్టకరమని, కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచిందని ఈదునూరి యాకయ్య మండిపడ్డారు. అదే విధంగా నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోళ్లు నిలిచిపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పంటను విక్రయించలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా, బాధ్యత గల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. రైతు, కార్మిక సంక్షేమమే లక్ష్యమని చెప్పుకునే ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని, ప్రాక్టికల్‌గా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని యాకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయిలో సమస్యలు ముదురుతున్నా, పరిష్కారానికి చర్యలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులు, కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఎంఆర్‌పిఎస్ హెచ్చరించింది. ప్రజల సమస్యలను విస్మరించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దూరంలో లేవని ఈదునూరి యాకయ్య స్పష్టం చేశారు.

## పెద్ది ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి

**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతిపక్షాల ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశానికి మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రావుల హరీష్‌రెడ్డి, నర్సంపేట మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాస్తవాలకు ఏ మాత్రం సంబంధం లేదని పేర్కొన్నారు. నెక్కొండలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల పెంపుపై చర్యలు చేపడుతున్నట్లు పెండ్యాల హరిప్రసాద్ తెలిపారు. రైతులకు సౌకర్యం కల్పించేందుకు త్వరలో మరో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ చౌహాన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికి రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడంలో విఫలమైందని విమర్శించారు. గతంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర సివిల్ సప్లయి చైర్మన్‌గా ఉన్న కాలంలో గోనెసంచులు వందల కోట్ల రూపాయలు స్వాహా చేశారని అందరికి తెలిసిన విషయమేనని, కొనుగోలు కేంద్రాల పేరుతో ప్రచారం చేసినా, రైతుల పంటల అమ్మకాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. తూకంలో ఆలస్యం, చెల్లింపుల్లో జాప్యం, మధ్యవర్తుల దోపిడి వంటి సమస్యలను పరిష్కరించలేకపోయిందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకొని కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. అవసరమైన చోట అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని వారు అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఆవుల శ్రీనివాస్, కొనిజెటి బిక్షపతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సాయి కృష్ణ, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దొడ్డ విజయ్, బొమ్మలపైన రమేష్, కొత్తపల్లి రత్నం, పాల్గొన్నారు.

## కా|| సంజయ్‌సింఘ్వికి నివాళులు : టియుసిఐ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** టియుసిఐ ఆధ్వర్యంలో కోటగల్లీలోని శ్రామిక భవన్‌లో కా|| సంజయ్ సింగ్వి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించామన్నారు. ఈ సందర్భంటా టియుసిఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, సుధాకర్ మాట్లాడుతూ టియుసిఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి కా|| సంజయ్ సింగ్వి ఇంటర్నేషనల్ కోఆర్డినేషన్ ఆఫ్ రివాల్యూషనరీ పార్టీస్ అండ్ ఆర్గనైజేషన్స్, ఆసియా కోఆర్డినేటర్‌గా పని చేశారు. ప్రారంభం నుండి ఆయన టియుసిఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారన్నారు. కా|| సంజయ్ 40 సం||రాలకు పై విప్లవ కమ్యూనిస్ట్ ఉద్యమంలో చురుకుగా ఉన్నారన్నారు.కార్యక్రమంలో వెంకన్న, రాజేశ్వర్, సాయరెడ్డి, కిరణ్, గణేష్, సాయిబాబా, శివ కుమార్, శాంతికుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

## ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళామనులచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. ప్రతినెల చివరి శుక్రవారం లలితా దేవి సహస్ర నామావళి సామూహిక కుంకుమార్చన నిర్వహించటం జరుగుతుందని ఇందులో భాగంగా మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి అమ్మవార్లకు భక్తితో పూజలు చేసి సామూహిక కుంకుమార్చన నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రవణ్, మహిళలు పాల్గొన్నారు.

## నేడు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

**ప్రజాపక్షం/ముప్కాల్:** మండల కేంద్రంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని హనుమాన్ భక్తులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పడి లేచిన మర్రిచెట్టు ఆలయ ప్రాంగణంలో సామూహిక హనమాన్ చాలీసా పారాయణం చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ రామానంద రాయ్ గౌరదాస ప్రభుజీ, విశిష్ట అతిథిగా శ్రీశ్రీశ్రీ హరచారి నారాయణస్వామి, ప్రధాన వక్తా నర్ర వెంకట శివకుమార్ రానున్నానరన్నారు. కావున మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై హిందూ సమ్మేళన కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల హనుమాన్ భక్తులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

ప్రజాపక్షం /నడికూడ : నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పేరెంట్స్ మీటింగ్ జరగగా గ్రామ కార్యదర్శి లావణ్య పాల్గొని మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చెరువులు,బావులు,వాగుల వద్దకు ఈతకు వెళ్లే పిల్లల పట్ల పేరెంట్స్ జాగ్రత్తగా ఉండాలని ఎండ ప్రభావం ఉంది కావున పిల్లలను బయటికి పంపకుండా చూసుకోవాలని రోజు చాలా సార్లు నీరు త్రాగాలని పానీయాలు తగ్గించుకోవాలని పోషకాహారం,పండ్లు,పాలు,కూరగాయలు ఎక్కువ తీసుకోవడం మంచిదని తెలియని వారితో మాట్లాడవద్దని పిల్లలకు చెప్పాలని బయటికి ఒంటరిగా పిల్లలను వెళ్లకుండా చూసుకోవాలని పిల్లలకు మొబైల్ ను ఇవ్వకూడదని ప్రతిరోజు వ్యాయామం చేయడం మంచిదని ఇంటి వద్దనే పిల్లలను ఉండేలా చూసుకోవాలని కోరుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

## 30న పిహెచ్ డి ప్రవేశాలకు మౌఖిక పరీక్షలు

ప్రజాపక్షం/ వరంగల్ టౌన్ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పిహెచ్ డి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 30న మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ ప్రకటనలో భాగంగా ఈ మౌఖిక పరీక్షలు హైదరాబాద్ బాచుపల్లి లోని తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయంలో ఏప్రిల్ 30 న మధ్యాహ్నం 12 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జానపద గిరిజన విజ్ఞానంపై జరిగే ఈ మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థుల పరిశోధన సామర్థ్యం, సంబంధిత పరిశోధన అంశంపై అవగాహన, అకాడమిక్ ప్రతిభను సమగ్రంగా అంచనా వేస్తామని అన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్, గుర్తింపు పత్రాలు వెంట తీసుకు రావాలని వెంకన్న సూచించారు.

## నూతన కరెంట్ పోల్స్, వైర్ల ప్రారంభం



ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కునుసోత్ తండాలో నూతనంగా ఏర్పాటుచేసిన కరెంట్ పోల్స్, వైర్ల పనులను గ్రామ సర్పంచ్ కునుసోతు మంగమ్మ, శ్రీను నాయక్ ప్రారంభించారు. తండా ప్రజలకు మెరుగైన విద్యుత్ సదుపాయం అందించేదుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూడు మంగమ్మ, రాజేందర్, వార్డు సభ్యులు పాలిత్య శంకర్ నాయక్, తండావాసులు హరిలాల్ నాయక్, జాన్య, రాంబాబు, వీరన్న, బొడ బికు, తిరుమల్, నరేష్, రంగమ్మ, ఈరమ్మ, లక్ష్మి, హంజరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డ్రైవర్ మృతి పట్ల వరంగల్ ఎంపి కావ్య దిగ్భ్రాంతి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు.ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, ప్రభుత్వం చర్చల ద్వారా కార్మికుల డిమాండ్ లను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్న క్రమంలో కార్మికులు ఆందోళన చెందడం విచారకరం అన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబ భవిష్యత్తులో దెబ్బతీస్తాయి కాబట్టి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు సహనం పాటిస్తూ, చర్చల ద్వారా పరిష్కారం సాధించుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.శంకర్ గౌడ్ మృతి మృతి పట్ల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం /ఎల్కతుర్తి : ఎల్కతుర్తి మండలంలోని ఇంద్రనగర్ గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్వచ్ఛతపై ప్రత్యేక చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబాల రాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న భారతదేశం కేవలం స్వాతంత్ర్యంతోనే కాదు, పరిశుభ్రతతో కూడిన సమాజంతోనే సార్థకమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కంటే పారిశుధ్యమే ముఖ్యం అనే గాంధీజీ ఆలోచనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.గ్రామ ప్రజలందరూ తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో పాటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, దాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు.చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా క్రమ పద్ధతిలో నిర్వహించుకోవాలని, గ్రామంలో శుభ్రతను కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన అన్నారు. నీటి సంరక్షణపై కూడా దృష్టి సారిస్తూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని వివరించారు.స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించడంలో గ్రామ ప్రజల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక అడుగు స్వచ్ఛత వైపు వేస్తే దేశం పూర్తిగా పరిశుభ్రంగా మారుతుందని అంబాల రాజు కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం ఆశ వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసిఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న సమ్మె సందర్భంగా హనుమకొండ డిపో ముందు ఆర్‌టిసికార్మికులు చేస్తున్న ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ పాల్గొని మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ తదితర 32 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరుగార్చడమేనని, ప్రభుత్వం తక్షణమే జెఏసి నాయకులతో చర్చలు జరిపి, ఆర్‌టిసికార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని రమేష్ డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా రావలసిన సుమారు రు. 400 కోట్లతో పాటు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించి, సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలన్నారు. అద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలక్ట్రిసిటీ బస్సులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి నడుపుతున్నదని, ప్రభుత్వమే నేరుగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని సంపూర్ణంగాఆర్‌టిసి సంస్థకే అప్పగించాలని, ఏళ్ల తరబడి కనీస వేతనాలు, సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడికి గురవుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలను జరపకపోవడం అంటే వారి హక్కులను కాలరాస్తూ, కార్మికుల గొంతు నొక్కడమేనని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎస్ డబ్ల్యు ఎఫ్ రీజియన్ అధ్యక్షులు టి ఎల్లయ్య, డిపో సెక్రటరీ పి.మహేందర్,కేసరి, కే రతన్, టి శ్రీనివాస్, వైవీ లక్ష్మీ, పి పుష్ప, మోహన్, ఆర్ శ్రీధర్, యం చారి, శ్రీనివాస్, ఆర్‌టిసి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, మాజీ ఎంపిలను అడ్డుకున్న పోలీసులు



ప్రజాపక్షం/రఘునాథపల్లి: నర్సంపేటలో గురువారం ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఆర్టీసి బస్ డ్రైవర్ శంకర్ గౌడ్ శుక్రవారం అంత్యక్రియలు జరుగనున్న నేపథ్యంలో నర్సంపేటకు వెళ్తున్న మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాలోతు కవితలను శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పై అధికారుల ఆదేశాల మేరకు కోమల టోల్ ప్లాజా వద్ద వారిని రఘునాథపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని సీఐ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే పార్టీ శ్రేణులతో పాటు మండల నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీస్ స్టేషన్ ఎదుట అరెస్ట్ చేసిన మాజీ మంత్రి, మాజీ ఎంపీలను వెంటనే విడుదల చేయాలంటూ ధర్నా నిర్వహించారు. తరువాత పోలీసులు కలుగజేసుకుని పై అధికారులతో మాట్లాడి అరెస్టు చేసిన వారిని విడుదల చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. పై అధికారుల ఆదేశాల మేరకు మాజీ హోం మంత్రి సబిత ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాలోతు కవి తలను విడుదల చేశారు. ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదని ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనన్నారు. ఆ యన కుటుంబానికి రూ.10లక్షలు కాదు రూ.1కోటి పరిహారం ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అతని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పోలీసులు వారిని నర్సంపేటకు వెళ్లడానికి అనుమతి నిరాకరించడంతో చివరకు వారంతా వెనుతిరిగి జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి అక్కడి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పడంతో వేడెక్కిన సీఐ కార్యాలయ వాతావరణం ఒక్కసారిగా చల్లబడి అటు పోలీసులు, ఇటు నాయకులు, కార్యకర్తలు అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం / వేలేరు : వేలేరు మండలంలోని మల్లికుదుర్ల,గుండ్ల సాగర్,సోడషపల్లి,శాలపల్లి,పీచర గ్రామాలలోని సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఐకెపి ఎపిఎం అనిత,ఎ.ఐ కవిత దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను ఆశ్రయించి మోసపోకూడదనే సదుద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే దాన్యం కొనుగోలు చేస్తోందని అన్నారు.రైతులు ఐకెపి కేంద్రాలలోనే దాన్యం అమ్ముకాలు చేయాలని రోడ్లమీద దాన్యం ఆరబోయడం వలన ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున దాన్యరాశులను రోడ్ల మీద ఆరబోయకూడదని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు జక్కుల మౌనిక సంపత్ యాదవ్, మానస శివ,వెన్నం రమాదేవి సంపత్‌రెడ్డి,కూరపాటి అశోక్,మరిజె అనిత నర్సింగారావు,ఎఇఒలు శిల్ప,విజయ్,సిసిలు సతీష్,రమాదేవి,నాగమణి,మండలస మాఖ్యఅధ్యక్షురాలు ఆల్ల రేణుక,వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులు,విఒఎలు,మహిళలు,రైతులు,హమాలీలు వివిద గ్రామాల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే మద్దతు ధర లభిస్తుందని మార్కెట్ చైర్మన్ సంతాజీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఐకెపి–ఎస్‌ఈఆర్‌పి ఆధ్వర్యంలో కొత్తకొండ, భీమదేవరపల్లి,వంగర, మాణిక్యపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సంతాజీ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు సమర్థంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరతో పాటు అదనపు బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏపీఎం వేణు,మార్కెట్ వైస్ చైర్మన్ స్రవంతి,స్థానిక సర్పంచ్‌లు,పి. సదానందం,కర్ణాకర్, అశోక్,టి.పద్మ తదితరులు పాల్గొన్నా రు.

## గిగ్ వర్కర్ల గుర్తింపు చరిత్రాత్మక నిర్ణయం

ప్రజాపక్షం/జనగామ :గిగ్ వర్కర్ల గుర్తింపు చారిత్రాత్మక నిర్ణయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. శుక్రవారం జిల్లా పొలిటికల్ అడ్వజరి కమిటి సమావేశం డిసిసి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి మాట్లాడుతూ స్విగ్గి, జుమోటో వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్, ప్లాట్‌ఫాంలలో పనిచేసే డ్రైవర్లను ప్రత్యేక కార్మికులుగా గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ నిర్ణయం ద్వారా వారికి సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందనాను. పార్టీ బలోపేత, జిల్లా మండలాల్లో, గ్రామ స్థాయిలో కమిటిల ఏర్పాటుపై చర్చించారు. ప్రజల సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు లొక్కుంట్ల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బోనాసి క్రాంతి, సేవాదళ్ అధ్యక్షుడు పొరుపల్లి ప్రభాకర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ జాఫర్ షరీఫ్, ఆర్టీఐటిఐఎస్ జిల్లా అధ్యక్షులు సాధం మనోహర్, ఆదివాసి సెల్ అధ్యక్షుడు సునావత్ సుమన్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.